వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 084
పేజీలు : 04 | వెల: రూ.5/-
శుక్రవారం
మార్చి 20, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

## నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

- కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి
- ఘనంగా అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రధానోత్సవం



2లో..

# సంక్షేమానికే పెద్దపీట



2లో..

- రూ.3.24 లక్షల కోట్లతో తెలంగాణ భారీ బడ్జెట్
- కోటి కుటుంబాలకు 'ఇందిరమ్మ జీవిత బీమా'
- జూన్ 2 నుంచి అమలుకు సన్నాహాలు
- కోటి 15 లక్షల కుటుంబాలకు భరోసా

తెలంగాణ రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో మరో కీలక అడుగు పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.3,24,234 కోట్ల భారీ అంచనాతో వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం శాసనసభలో ఈ పద్దును సమర్పించారు. సంక్షేమం, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తూ బడ్జెట్ కేటాయింపులు జరిగాయి.కోటి కుటుంబాలకు 'ఇందిరమ్మ జీవిత బీమా'ఈ బడ్జెట్‌లో అత్యంత కీలకమైన ప్రకటనే 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం'. రాష్ట్రంలోని సుమారు కోటి 15 లక్షల కుటుంబాలకు భరోసా కల్పిస్తూ, ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమాను ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకాన్ని రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్ 2 నుంచి అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు.

వరంగల్ వాయిస్, హైదరాబాద్:

## గ్యాస్ ఏజెన్సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

వినియోగదారులకు అందుతున్న సేవలపై ఆరా

ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు



**వరంగల్ వాయిస్, ఏటూరునాగారం :** మండల కేంద్రంలోని హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్యాస్ సిలిండర్ల నిల్వలు, పంపిణీ తీరు, వినియోగదారులకు అందుతున్న సేవలపై ఆయన స్వయంగా ఆరా తీశారు. తనిఖీలో భాగంగా ఏజెన్సీలోని స్టాక్ రిజిస్టర్లను, సిలిండర్ల బరువును కలెక్టర్ పరిశీలించారు. వినియోగదారులకు గ్యాస్ సరఫరాలో ఎలాంటి జాప్యం జరగకూడదని, నిబంధనల ప్రకారం పంపిణీ సాగాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆకస్మిక తనిఖీతో మండల కేంద్రంలోని ఇతర వాణిజ్య సంస్థల నిర్వాహకులలో ఒక్కసారిగా కలకలం రేగింది. కలెక్టర్ వెంట సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## అంకెల గారడీ బడ్జెట్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- కాంగ్రెస్ బడ్జెట్ 6 గ్యారంటీలకు పాడె కట్టేలా ఉంది
- వరంగల్ జిల్లాకు బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం
- సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎయిర్‌పోర్ట్ ఊసేలేదు




4లో..

## మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు



2లో..

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- నర్సంపేటలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం
- క్వింటాల్‌కు రూ.2400 మద్దతు ధర
- మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోళ్లు
- మార్కెట్ యార్డ్‌లో రైతులకు అన్ని వసతులు కల్పించాలి



4లో..

## నిఖార్సైన కార్యకర్తలకే డీసీసీ పదవులు ఇవ్వాలి

పీసీసీ చీఫ్‌కు ఎమ్మెల్సీ సారయ్య, నల్గొండ రమేష్ విజ్ఞప్తి

గాంధీ భవన్‌లో మహేష్ కుమార్ గౌడ్‌తో భేటీ

## 'లొట్టపీసు బడ్జెట్'

ఆర్థికవేత్త ఏనుగుల రాకేష్ రెడ్డి

ఆరు గ్యారంటీలకు మంగళం పాడారు

డిక్లరేషన్లకు నీళ్లొదిలారు

3లో..



# సంక్షేమానికే పెద్దపీట

- రూ.3.24 లక్షల కోట్లతో తెలంగాణ భారీ బడ్జెట్
- కోటి కుటుంబాలకు 'ఇందిరమ్మ జీవిత బీమా'
- జూన్ 2 నుంచి అమలుకు సన్నాహాలు
- కోటి 15 లక్షల కుటుంబాలకు భరోసా



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో మరో కీలక అడుగు పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.3,24,234 కోట్ల భారీ అంచనాతో వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం శాసనసభలో ఈ పద్దును సమర్పించారు. సంక్షేమం, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తూ బడ్జెట్ కేటాయింపులు జరిగాయి.కోటి కుటుంబాలకు 'ఇందిరమ్మ జీవిత బీమా'ఈ బడ్జెట్‌లో అత్యంత కీలకమైన ప్రకటనే 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం'. రాష్ట్రంలోని సుమారు కోటి 15 లక్షల కుటుంబాలకు భరోసా కల్పిస్తూ, ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమాను ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకాన్ని రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్ 2 నుంచి అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు.

## ప్రధాన శాఖల వారీగా కేటాయింపులు:

బడ్జెట్‌లో పల్లె ప్రగతి నుండి పట్టణాల అభివృద్ధి వరకు అన్ని రంగాలకు సమ ప్రాధాన్యత కల్పించారు.శాఖకేటాయింపులు (రూ. కోట్లలో)పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి 33,688, విద్యా శాఖ 26,674, నీటిపారుదల శాఖ 22,615, విద్యుత్ శాఖ 21,285, పురపాలక, పట్టణాభివృద్ధి 17,907, వైద్య, ఆరోగ్య శాఖ 13,679, ఆర్ అండ్ బీ 12,789, హోం శాఖ 11,907 కేటాయించింది. దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం భారీ నిధులను కేటాయించింది.ఎస్సీ సంక్షేమం రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమం రూ. 7,937 కోట్లు, బీసీ సంక్షేమం రూ.3,769 కోట్లు, మహిళా శిశు సంక్షేమం రూ. 3,143 కోట్లు, యువతకు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తూ రాష్ట్రంలోని 118 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో శిక్షణ పొందుతున్న ట్రైనీలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారికి ప్రతి నెలా రూ. 2,000 స్టైఫండ్ (స్కాలర్‌షిప్) ఇవ్వాలని నిర్ణయించింది. అలాగే, రాజీవ్ యువ వికాసం కోసం రూ. 6,000 కోట్లు కేటాయించి నిరుద్యోగ యువతకు అండగా నిలిచింది. గృహ నిర్మాణంలో భాగంగా ఇళ్ల నిర్మాణాల కోసం రూ.7,430 కోట్లు, పరిశ్రమల శాఖకు రూ.3,490 కోట్లు, ఐటీ శాఖకు రూ.875 కోట్లు, రాబోయే పుష్కరాల నిర్వహణ కోసం ముందస్తుగా రూ.500 కోట్లు కేటాయించారు. హెచ్-సిటి పథకం కింద రూ. 2,654 కోట్లు కేటాయించారు. బడ్జెట్ ప్రసంగం అంతటా ప్రభుత్వం ప్రజా సంక్షేమం, పారదర్శక పాలనే లక్ష్యమని భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు.

## ఉమ్మడి వరంగల్‌ను విస్మరించిన బడ్జెట్

### సీపీఐ నేత తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ధ్వజం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. బడ్జెట్ కేటాయింపులపై స్పందించిన ఆయన, ప్రభుత్వం వరంగల్ అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌పై చూపిన శ్రద్ధలో సగం కూడా వరంగల్‌పై చూపలేదని శ్రీనివాసరావు పేర్కొన్నారు. "వరంగల్‌ను హైదరాబాద్‌కు దీటుగా, రాష్ట్ర రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం.. బడ్జెట్‌లో మాత్రం ఆ ఊసే ఎత్తలేదు. వరంగల్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు, కొత్త ప్రాజెక్టులు లేదా పరిశ్రమల ఏర్పాటుపై ఎటువంటి స్పష్టత లేదు" అని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ వరప్రదాయిని అయిన దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన ప్రత్యేక నిధుల కేటాయింపు జరగలేదని ఆయన గుర్తు చేశారు. పేదల దవాఖానగా పేరుగాంచిన వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి ఆధునీకరణకు, వసతుల కల్పనకు నిధులు కేటాయించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తన ఎన్నికల వాగ్దానాలను తుంగలో తొక్కిందని శ్రీనివాసరావు విమర్శించారు. గతంలో ఇచ్చిన హామీని ప్రస్తావించకుండా నిరుద్యోగులను మరోసారి మోసం చేశారు. ప్రతి నెలా అర్హులైన మహిళల ఖాతాల్లో రూ. 2,500 జమ చేస్తామన్న హామీ అతీగతీ లేదు. అన్నదాతలకు అందాల్సిన రైతు భరోసా సకాలంలో అందడం లేదు. వరంగల్ నగరంలోని స్లమ్ ఏరియాల అభివృద్ధికి బడ్జెట్‌లో ఎలాంటి ప్రత్యేక ప్రణాళికలు లేవు. మొత్తంగా చూస్తే ఈ బడ్జెట్ కేవలం గణాంకాల గారడీయే తప్ప, సామాన్యులకు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చేకూరిన ప్రయోజనం శూన్యమని ఆయన స్పష్టం చేశారు.

## నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

### కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి

### అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రధానోత్సవం



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** విద్యార్థులు పాఠశాల దశ నుండే క్రమశిక్షణను అలవర్చుకుని, ఉన్నతమైన లక్ష్యాలతో విద్యను అభ్యసించాలని డీసీసీ అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని సెయింట్ థెరిసా పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన 'అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డు' ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జాయిస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇనగాల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి దశలో చదువుతో పాటు క్రీడలు, క్రమశిక్షణ ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, తమలోని సృజనాత్మకతను వెలికితీసి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. సమాజానికి, దేశానికి సేవ చేసేలా నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వివిధ విద్యా విషయాల్లో, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థుల కేరింతల మధ్య ఈ కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు, మాజీ సర్పంచ్ నాగిల్లి సామెల్, వార్డు సభ్యులు బయ్య కుమారస్వామి, మాజీ ప్యాక్స్ డైరెక్టర్ రమేష్, నాయకులు వడ్డేపల్లి ప్రసాద్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన – ప్రగతి పథమే లక్ష్యం

### కేయూ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ నిర్మాణం

### రూ.45 లక్షల నిధులతో మౌలిక వసతుల కల్పన

### ఎమ్మెల్యేలు నాయిని , కేఆర్ నాగరాజు, కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం.



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగర సుందరీకరణతో పాటు ప్రజా భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా హనుమకొండ కేయూ క్రాస్ రోడ్డు నుంచి వివేక్ నగర్ వరకు రోడ్డు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.45 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక సెంట్రల్ లైటింగ్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ లతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఈ విద్యుత్ దీపాలను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యమని, ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ప్రధాన రహదారులపై ఆధునిక సెంటర్ లైటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం మరిన్ని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ, నగర సుందరీకరణలో భాగంగా చేపట్టిన ఈ పనులు ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థతో పాటు స్ట్రీట్ లైటింగ్ పనులను దశలవారీగా చేపట్టి హనుమకొండను ఆధునిక నగరంగా తీర్చిదిద్దుతాం. ప్రభుత్వం "ప్రజా పాలన–ప్రగతి పథం" నినాదంతో ముందుకు సాగుతోందని, ఏ ప్రాంతం కూడా అభివృద్ధిలో వెనుకబడకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. చీకటిగా ఉండే ఈ మార్గంలో ఆధునిక వెలుగులు రావడంతో వివేక్ నగర్, కేయూ ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి పూట రాకపోకలు సాగించే మహిళలు, విద్యార్థులకు ఈ లైటింగ్ ఎంతో భరోసానిస్తుందని పేర్కొంటూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు


- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- నర్సంపేటలో కొనుగోలు కేంద్రం ప్రారంభం
- క్వింటాల్‌కు రూ. 2400 మద్దతు ధర
- మార్కెట్ యార్డ్‌లో రైతులకు వసతులు కల్పించాలి



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** రైతులు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. శుక్రవారం నర్సంపేట మార్కెట్ యార్డ్‌లో తెలంగాణ మార్క్ ఫెడ్,నర్సంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొక్కజొన్న సాగు చేసిన రైతులు ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ముఖ్యంగా మొక్కజొన్నలో తేమ శాతం 14 శాతానికి మించకుండా చూసుకోవాలని, అప్పుడే మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం క్వింటాల్ మొక్కజొన్నకు రూ.2400 ధర నిర్ణయించిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మార్కెట్ యార్డ్‌కు వచ్చే రైతులకు తాగునీరు, విశ్రాంతి గదులు, నీడ కోసం షెడ్లు వంటి కనీస వసతులు కల్పించాలని సూచించారు. ్రకయించిన పంటకు సంబంధించిన నగదు రైతులకు సకాలంలో నేరుగా వారి ఖాతాల్లోనే జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని మార్క్ ఫెడ్ అధికారులను ఆదేశించారు. రైతులు మధ్యవర్తుల మాటలు నమ్మి తక్కువ ధరకు అమ్ముకోవద్దని, ప్రభుత్వ కేంద్రాల్లోనే నేరుగా విక్రయించుకోవాలని పిలుపునిచ్చారు. నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, డీసీఓ నీరజ, మార్క్ ఫెడ్ డీఎం రంజిత్ రెడ్డి, ఆర్డీఓ ఉమారాణి, తహసీల్దార్ రవిచంద్ర రెడ్డి, రైతులు, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుల ఆర్థికాభివృద్ధికి పాడి పశువులే ఆధారం

- పశు సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి
- పోచారంలో ఘనంగా పశువైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, పరకాల :** రైతుల ఆర్థిక ఎదుగుదలలో పశుసంపద కీలక పాత్ర పోషిస్తుందని, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా పరకాల మండలం పోచారం గ్రామంలో ఏఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజిరెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగమైన పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు మార్కెట్ కమిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. రైతుల శ్రేయస్సును కాంక్షించి, వారి పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పశువులకు అవసరమైన మందులు, నట్టల నివారణ టీకాలను ఆయన పంపిణీ చేశారు. వేసవి కాలంలో పశువులకు సోకే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శిబిరానికి తరలివచ్చిన పశువులకు డాక్టర్లు వినయ్, శ్రీరామ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పశువుల పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్, మార్కెట్ సూపర్వైజర్ వేణుగోపాల్, గ్రామ సర్పంచ్ పెంతల మధుకర్, ఉపసర్పంచ్ కొలపాక చందు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బుడిమే రాజయ్య, పెండ్యాల కుమారస్వామి, దాసరి బిక్షపతి, బొమ్మకంటి రుద్రమదేవి చంద్రమౌళి, రైతులు పాల్గొన్నారు.

# పక్షుల సంరక్షణ మనందరి బాధ్యత



**వరంగల్ వాయిస్, నడికూడ :** ప్రకృతిలో అంతరించిపోతున్న పక్షి జాతులను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని ముస్త్యాలపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుకూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం 'ప్రపంచ పిచ్చుకల దినోత్సవం' సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల్లో పక్షుల పట్ల ప్రేమ, బాధ్యతను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పిచ్చుకల ఇతివృత్తంతో చిత్రలేఖన పోటీలు నిర్వహించగా, చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పిచ్చుకల జీవన విధానం, వాటి ప్రాధాన్యతను, సంరక్షణను ప్రతిబింబించేలా విద్యార్థులు గీసిన చిత్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారులు తమ సృజనాత్మకతతో పిచ్చుకల అందాలను కాగితంపై ఆవిష్కరించారు. సమావేశంలో హెచ్ఎం కందుకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రకృతి సమతౌల్యాన్ని కాపాడటంలో పిచ్చుకలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఆధునిక జీవనశైలి, సెల్ టవర్ల రేడియేషన్, ఆహార కొరత కారణంగా పిచ్చుకల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, పక్షులకు దాహం తీర్చేందుకు ఇంటి ఆవరణలో, చెట్లపై నీటి పాత్రలను ఏర్పాటు చేయాలని సూచించారు. "పిడికెడు గింజలు – గ్లాసెడు నీళ్లు" అనే చిన్న చర్యతో పిచ్చుకల ప్రాణాలను కాపాడవచ్చని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పావని, సత్యపాల్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. పక్షుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఈ సందర్భంగా తీర్మానించారు.

# మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని 66వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కనపర్తి కిరణ్ పేర్కొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు శుక్రవారం హసన్ పర్తి మసీదు ఆవరణలో ముస్లిం సోదరులకు 'ఈద్–కా–తోఫా' పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కనపర్తి కిరణ్ ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ తెలుపుతూ రంజాన్ తోఫాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం మనుషుల్లో కరుణ, పరస్పర గౌరవం మరియు క్రమశిక్షణను పెంపొందించే పవిత్రమైన పర్వదినమని కొనియాడారు. సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడేలా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. మైనార్టీల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ వెంకటేశ్వర్లు, జన్ను రవీందర్, ఆరెల్లి వెంకటస్వామి, పుల్ల రవీందర్, పెద్దమ్మ నరసింహ రాములు, మేకల ఆనంద్, గొర్రె కిరణ్ కుమార్, పోతరాజు ప్రభాకర్, తాళ్ల మధు, గరిగే రాజు, బిగుళ్ల సురేష్, ఆసిఫ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మైనారిటీ మత పెద్దలు పాల్గొన్నారు.

# 'లొట్టపీసు బడ్జెట్'

- ఆర్థికవేత్త ఏనుగుల రాకేష్ రెడ్డి
- ఆరు గ్యారంటీలకు మంగళం పాడారు
- డిక్లరేషన్లను నీళ్లొదిలారు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్ పూర్తిగా దిశానిర్దేశం లేని "వట్టి బడ్జెట్" అని ప్రముఖ ఆర్థికవేత్త, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని తన కార్యాలయం నుంచి ఆయన బడ్జెట్‌పై తనదైన శైలిలో విశ్లేషణాత్మక స్పందనను వ్యక్తం చేశారు. ఎకానమీలో గోల్డ్ మెడలిస్ట్ అయిన రాకేష్ రెడ్డి ఈ బడ్జెట్‌ను 'లొట్టపీసు బడ్జెట్'గా అభివర్ణించారు. "ఈ బడ్జెట్‌లో విజన్ లేదు, విషయం లేదు.. క్లారిటీ లేదు, కమిట్మెంట్ అంతకంటే లేదు. ఇది కేవలం బడాయిలు చెప్పుకోవడానికే పరిమితమైన బోగస్ బడ్జెట్. సామాన్య ప్రజలకు, పెట్టుబడిదారులకు, మార్కెట్‌కు విశ్వాసం కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది" అని ఆయన మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఆయన ఆరోపించారు. ఆరు గ్యారంటీలకు మంగళం పాడారని, డిక్లరేషన్లను నీళ్లొదిలారని విమర్శించారు. "యువతకు జాబ్ లేదు.. వారి పట్ల కనీస జాలి కూడా లేదు అని ప్రకటించిన బడ్జెట్ ఇది. నిరుద్యోగుల బతుకుదెరువుకు సమాధి కడుతూ వారి భవిష్యత్తును శాశ్వతంగా దెబ్బతీస్తున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ పథకాలను పేర్లు మార్చి తమవిగా ప్రచారం చేసుకుంటున్నారని రాకేష్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలే కథానాయకులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలు ఐక్యంగా పోరాటం చేస్తే తప్ప ఈ ప్రభుత్వం మేల్కొనేలా లేదని రాకేష్ రెడ్డి స్పష్టం చేశారు. పదేళ్లుగా బడ్జెట్‌లను విశ్లేషిస్తున్న అనుభవంతో చెబుతున్నానని, ఈ పద్దు రాష్ట్ర ప్రగతికి ఏమాత్రం దోహదపడదని ఆయన తేల్చి చెప్పారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పవిత్ర రంజాన్ మాసం ముగింపును పురస్కరించుకుని జరుపుకునే 'ఈద్–ఉల్–ఫితర్' పండుగ సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నెల రోజుల పాటు ముస్లిం సోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో, కఠిన ఉపవాస దీక్షలు ఆచరించి ఆధ్యాత్మిక విలువలను చాటుకున్నారని కొనియాడారు. సమాజంలో అన్ని వర్గాల మధ్య ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని ఆయన ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని ముస్లిం సోదరులందరికీ ఈద్ ముబారక్ తెలియజేశారు.

# ఫార్మసిస్ట్ గ్రేడ్–2 ఫలితాలను వెంటనే ప్రకటించాలి

- ఉప్ప భాస్కరరావు డిమాండ్

**వరంగల్ వాయిస్, హైదరాబాద్/హనుమకొండ:** రాష్ట్రంలో ఫార్మసిస్ట్ గ్రేడ్–2 ఉద్యోగాల కోసం వేచి చూస్తున్న వేలాది మంది నిరుద్యోగుల ఆవేదనను పరిగణనలోకి తీసుకుని, నియామక ఫలితాలను తక్షణమే వెల్లడించాలని రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ మాజీ ఉపాధ్యక్షులు ఉప్పు భాస్కరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి కార్యాలయం, వైద్యారోగ్య శాఖ మంత్రి, సంబంధిత అధికారులకు లేఖలు రాశారు. తెలంగాణ రాష్ట్ర మెడికల్ రిక్రూట్మెంట్ బోర్డ్ (ఎంహెచ్ఎస్ఆర్ బీ) 2024 నవంబర్ 30న ఫార్మసిస్ట్ గ్రేడ్–2 పోస్టుల భర్తీకి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహించింది. మొత్తం 732 ఖాళీల (633+99) కోసం రాష్ట్రవ్యాప్తంగా 24,578 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష జరిగి దీర్ఘకాలం గడుస్తున్నా ఫలితాలు ప్రకటించకపోవడంతో అభ్యర్థులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. నియామక ప్రక్రియలో కొన్ని అభ్యంతరాలతో కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. "ఇటువంటి వివాదాలు సహజమే, కానీ ప్రభుత్వం, వైద్యారోగ్య శాఖ వీటి పరిష్కారంలో వేగంగా వ్యవహరించాలి. ఇప్పటికే డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, న్యాయశాఖ నుంచి సలహాలు తీసుకున్న ప్రభుత్వం, తాజాగా అడ్వకేట్ జనరల్ సూచనలను కోరుతూ లేఖ రాయడం శుభపరిణామం. అయితే, ఈ ప్రక్రియను త్వరితగతిన ముగించి తుది ఫలితాలు వెల్లడించాలి" అని కోరారు. అధికారులు తక్షణమే స్పందించి, సమస్యను పరిష్కరించి అర్హులైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# గొడుగులు, దుప్పట్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, జనగామ :** సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలవడమే లయన్స్ క్లబ్ ప్రధాన ఉద్దేశమని లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ బైరు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం జనగామ చౌరస్తాలోని వేంకటేశ్వర ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకుడు బొద్దుల రవీందర్ ఆధ్వర్యంలో ఎయిర్ గ్రేస్ అభ్యర్థి సిరాజ్‌కు గొడుగు, దుప్పటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బైరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో ఎనిమిది ప్రధాన లక్ష్యాలతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. దృష్టి లోపం నివారణ, ఆకలి తీర్చడం, పర్యావరణ పరిరక్షణ, బాల్య క్యాన్సర్ నియంత్రణ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు సహాయం, యువత అభివృద్ధి, మానవతా ప్రయత్నాలు, విపత్తు ఉపశమనం వంటి కీలక రంగాల్లో లయన్స్ క్లబ్ నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. పూర్వ రీజియన్ చైర్మన్ శ్రీరాం శ్రీనివాస్, పూర్వ అధ్యక్షుడు గాదె నర్సింహాలు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. పేద అభ్యర్థులను గుర్తించి వారికి అవసరమైన వస్తువులను అందజేసిన నిర్వాహకుడు బొద్దుల రవీందర్‌ను ఈ సందర్భంగా ప్రతినిధులు అభినందించారు.

# కోటగుళ్లను సందర్శించిన బ్రెజిల్ దేశస్థుడు



**వరంగల్ వాయిస్, గణపురం :** ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లను బ్రెజిల్ దేశానికి చెందిన ఇంగో శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టతను అర్చకులు జూలపల్లి నాగరాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ శిల్ప సంపదను ఫొటోలు, వీడియోలు చిత్రీకరించుకున్నారు. శిల్ప సంపద అద్భుతంగా ఉందని ఇంగో అన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ములుగు కలెక్టర్ దివాకర టీఎస్**



**వరంగల్ వాయిస్, ఏటూరునాగారం :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు,సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన ఏటూరునాగారంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. తనిఖీలో భాగంగా కలెక్టర్ ఆసుపత్రిలోని వార్డులు, లేబర్ రూమ్, ల్యాబ్, మెడికల్ స్టోర్ గదులను స్వయంగా పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి, సిబ్బంది హాజరును పర్యవేక్షించారు. వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్యం మరియు అందుబాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 14 ఏళ్లు నిండిన బాలికలు గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు ఆసుపత్రిలో ఎంతమందికి ఈ వ్యాక్సిన్ ఇచ్చారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఏవైనా మరమ్మతులు లేదా ఇతర అవసరాలు ఉంటే అంచనాలు రూపొందించి జిల్లా కార్యాలయానికి పంపాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. పనుల్లో జాప్యం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ డీసీహెచ్ఎస్ డాక్టర్ జగదీశ్వర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్, ఏటూరునాగారం సర్పంచ్ శ్రీలత, ప్రజా ప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# 'వీర హనుమాన్ విజయయాత్ర'




- ఏప్రిల్ 2న వరంగల్‌లో భారీ బైక్ ర్యాలీ
- వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ ప్రతినిధుల వెల్లడి
- యాత్రకు సంబంధించిన పోస్టర్ విడుదల

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఈ ఏడాది ఏప్రిల్ 2న వరంగల్ మహానగరంలో అత్యంత వైభవంగా 'వీర హనుమాన్ విజయయాత్ర' బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ ప్రకటించింది. శుక్రవారం వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ ప్రతినిధులు యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ భారీ బైక్ ర్యాలీ ఏప్రిల్ 2 సాయంత్రం 4:00 గంటలకు వరంగల్ రంగసాయిపేటలోని మహంకాళి దేవస్థానం నుంచి ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి వరంగల్ చౌరస్తా, పోచమ్మ మైదాన్, ములుగు రోడ్డు, అలంకార్ జంక్షన్ మీదుగా సాగి.. హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం పక్కన గల హయగ్రీవాచారి గ్రౌండ్స్‌కు చేరుకుంటుంది. ర్యాలీ ముగింపు సందర్భంగా హయగ్రీవాచారి గ్రౌండ్స్‌లో హనుమంతుడికి మహా హారతి కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 7:00 గంటల నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో ట్రైసిటీ (వరంగల్, హనుమకొండ, కాజీపేట) పరిధిలోని హిందూ బంధువులందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని హనుమంతుడి ఆశీస్సులు పొందాలని వీహెచ్‌పీ సాదరంగా ఆహ్వానిస్తోంది. ఈ సమావేశంలో వీహెచ్‌పీ ప్రాంత ఉపాధ్యక్షులు నేలకొండ భాస్కర్ రావు, విభాగ కార్యదర్శి నందాల చంద్రబాబు, విభాగ్ సంఘటన మంత్రి శివరాములు, జిల్లా అధ్యక్షులు కేసిరెడ్డి జైపాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వెలగందుల రాజు పాల్గొన్నారు. వీరితో పాటు బజరంగ్ దళ్ జిల్లా సంయోజకులు సాయిరాం సిద్ధు, సహ సంయోజకులు హర్ష, శ్రీధర్, జిల్లా సహ కార్యదర్శులు సందీప్ రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, రవి, వివిధ ప్రఖండాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## నిఖార్సైన కార్యకర్తలకే డీసీసీ పదవులు ఇవ్వాలి

**పీసీసీ చీఫ్‌కు ఎమ్మెల్సీ సారయ్య, నల్గొండ రమేష్ విజ్ఞప్తి**

**గాంధీ భవన్‌లో మహేష్ కుమార్ గౌడ్‌తో భేటీ**

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** వరంగల్ జిల్లాలో జిల్లా కాంగ్రెస్ కమిటీ పదవుల భర్తీ విషయంలో పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న అసలైన కార్యకర్తలకే ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, సీనియర్ నేత నల్గొండ రమేష్ పీసీసీ అధ్యక్షులను కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వరంగల్ జిల్లా రాజకీయ పరిస్థితులపై పీసీసీ చీఫ్‌తో వారు చర్చించారు. ప్రస్తుతం ప్రకటించబోయే డీసీసీ పదవుల విషయంలో క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టత కోసం కష్టపడిన వారికే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఎంతో మంది కార్యకర్తలు ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా, నిస్వార్థంగా పార్టీ జెండా మోస్తున్నారని వారిని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వెన్నంటి నిలిచిన వారికే పదవులు ఇవ్వడం ద్వారా కార్యకర్తల్లో నూతనోత్సాహం వస్తుందని వారు వివరించారు. వరంగల్ జిల్లాకు చెందిన మోస్ట్ సీనియర్ నాయకులు బస్వరాజు సారయ్య, నల్గొండ రమేష్ స్వయంగా గాంధీ భవన్‌కు వెళ్లి పీసీసీ చీఫ్‌ను కలవడం జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో పార్టీ సంస్థాగత బలోపేతానికి మరియు సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎంపిక చేసే విషయంలో తాము ఈ విన్నపం చేసినట్లు నేతలు ఈ సందర్భంగా తెలియజేశారు.

# అంకెల గారడీ బడ్జెట్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- వరంగల్ జిల్లాకు బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం
- సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎయిర్‌పోర్ట్ ఊసేలేదు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్ కేవలం అంకెల గారడీ అని, ఇది ప్రజలను వంచించే "దగా బడ్జెట్" అని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ విమర్శించారు. శుక్రవారం బడ్జెట్ కేటాయింపులపై ఆయన ఘాటుగా స్పందించారు. వరంగల్‌ను రెండో రాజధానిగా మారుస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం, ఆచరణలో వరంగల్ జిల్లాను విస్మరించిందని రవికుమార్ మండిపడ్డారు. "ఎంజీఎం ఆసుపత్రి అభివృద్ధికి నిధులు లేవు, కొత్త సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి రూపాయి కేటాయించలేదు. వరంగల్ ఎయిర్‌పోర్ట్, టెక్స్‌టైల్ పార్క్, హైవే రోడ్ల ప్రస్తావనే ఈ బడ్జెట్‌లో లేదు" అని ఆయన ఆరోపించారు. గ్రేటర్ వరంగల్‌కు ప్రభుత్వం మరోసారి మొండిచేయి చూపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలకు ఈ బడ్జెట్‌తో పాడె కట్టారని ఆయన విమర్శించారు. తులం బంగారం హామీ 'తుస్' అయిందని, ప్రతి నెల రూ. 2500 ఊసే లేదని ఎద్దేవా చేశారు.రైతు భరోసా రెండు విడతలు ఎగ్గొట్టారని, కౌలు రైతులు, కూలీల నోట్లో మట్టి కొట్టారని విమర్శించారు. రూ.5 లక్షల భరోసా కార్డుకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ధ్వజమెత్తారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచడం చేతగాక, మళ్లీ రూ. లక్ష కోట్ల అప్పులు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవ్వడం సిగ్గుచేటని రవికుమార్ అన్నారు. కేంద్ర నిధులపై ఆధారపడటం తప్ప రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా చేసిందేమీ లేదని విమర్శించారు. విద్యాశాఖకు 16 శాతం నిధులు ఇవ్వాలని కమిషన్ చెబితే, కేవలం 8 శాతానికే పరిమితం చేశారని గుర్తు చేశారు. బీసీలకు 4 శాతం కేటాయింపులు చేయడం వారిని అవమానించడమేనని, ఎస్సీ, ఎస్టీలకు సైతం అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. "దావోస్, గ్లోబల్ సమ్మిట్ పేరుతో లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని చెబుతున్న ఆర్థిక మంత్రి, ఆ వివరాలను వెల్లడించే దమ్ముందా?" అని ఆయన సవాల్ విసిరారు. వరంగల్ జిల్లాకు బడ్జెట్‌లో సున్నా కేటాయింపులు జరిగినందున, ఇక్కడి కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఏ ముఖం పెట్టుకుని తిరుగుతారని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధికి రూపాయి నిధులు తీసుకురాలేని నేతలు గల్లీల్లో గప్పాలు కొట్టడం ఆపాలని గంట రవికుమార్ హితవు పలికారు.

## మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** మహిళలు కేవలం గృహిణులుగానే పరిమితం కాకుండా, తమలోని నైపుణ్యాలను మెరుగుపరుచుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం మహాదేవపూర్ మండలం పలుగుల గ్రామపంచాయతీలో తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో ప్రభుత్వం ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. భారతీయ మహిళా పారిశ్రామికవేత్తల సంఘం ఆధ్వర్యంలో "చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి వేగవంతం" అనే ఇతివృత్తంతో ఈ 15 రోజుల శిక్షణ కొనసాగుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని మహిళలు చురుకుగా వినియోగించుకుని శిక్షణ పొందాలని సూచించారు. చైర్మన్ కోట రాజబాబుతో పాటు ఎంపీడీవో, ఏపీఎం, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు హాజరయ్యారు.

## బడ్జెట్‌లో రిటైర్డ్ ఉద్యోగులకు మొండిచేయి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్‌లో రిటైర్డ్ ఉద్యోగుల రిటైర్మెంట్ బకాయిల ప్రస్తావన లేకపోవడంపై రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ పెన్షనర్లను తీవ్రంగా నిరాశపరిచిందని అసోసియేషన్ బకాయిల సాధన కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కందుకూరి దేవదాసు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేవదాసు మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులు తమ జీవితకాలం దాచుకున్న సొమ్మును పొందేందుకు ఏళ్ల తరబడి వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వివిధ ప్రతిపక్ష పార్టీలు రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానాలను పరిగణనలోకి తీసుకోవాలని దేవదాసు కోరారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com